క్లుప్తంగా

ఐఐటీలో మెరిసిన అన్నదమ్ములు



ఐఐటీల్లో సీట్లు సాధించిన ఆశీష్, అనీష్

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల మండలం ద్వారకానగర్‌కు చెందిన అన్నదమ్ములు ఎన్ ఆశీష్, ఎన్ అనీష్ ఎంతో ప్రతిష్టాత్మకమైన ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ)ల్లో సీట్లు సాధించారు. ఐఐటీలో చదవాలనే కాంక్షతో ముందునుంచే ఒక ప్రణాళిక తో కష్టపడి చదవడం వల్ల తల్లిదండ్రుల, కుటుంబ సభ్యుల ప్రోత్సాహం, గురువుల సహకారంతో విజయం సాధించామని వారు తెలిపారు. ఇటీవల జరిగిన 2025, ఆల్ ఇండియా గేట్ ఎగ్జామ్‌లో ఉత్తమ ఫలితాలు సాధించి ఐఐటీ గౌహతి ఎయిరోస్పేస్‌లో ఆశీష్, ఐఐటీ బాంబే మెకానికల్‌లో అనీష్ సీట్ సాధించారు. వారిని పలువురు అభినందించారు.

యువ అథ్లెట్‌కు సన్మానం



పవన్‌కుమార్‌ను సన్మానిస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: మండలంలోని పంగిడిగూడెం గ్రామానికి యువ పారా అథ్లెట్ కాస్సే పవన్ కుమార్ రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచి స్వర్ణ పతకం సాధించాడు. ఈ నెల 9న విశాఖపట్నం పోలీస్ బ్యారెక్స్ గ్రౌండ్‌లో జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పారా అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్‌లో మూడు ఈవెంట్స్ ఉపయోగించుకొని విజయం సాధించాడు. ఈ సందర్భంగా శనివారం పంగిడిగూడెం సెంటర్లో అతనితో అంబేడ్కర్ సేవా సమితి సభ్యులు మానుకొండ శ్రీను, గోగులముడి సోమయ్య, కొదం కిషోర్, కాలి అశోక్, డిపల్లి సురేష్, చిన్నం భాస్కరరావు కేక్ కట్ చేయించారు. పూలమాల వేసి సన్మానించారు.

శ్రీకాకుళం జిల్లాకు లచ్చన్న పేరు పెట్టాలి



గౌతు లచ్చన్న విగ్రహం వద్ద పాల్గొన్న బీసీ నాయకులు

ఏలూరు (టూటౌన్): శ్రీకాకుళం జిల్లాకు సర్దార్ గౌతు లచ్చన్న పేరు పెట్టాలని బీసీ కులాలు, ఉద్యోగుల జేఏసీ పిలుపు నిచ్చింది. స్థానిక తంగెళ్లమూడి వంతెన సమీపంలో ఉన్న సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహం వద్ద జయంతి కార్యక్రమం శనివారం ఏపీ ఓబీసీ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం, బీసీ కులాలు జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించారు. జెడ్పీ చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ, నాయకులు గంటా ప్రసాద్ రావు, చిట్టి బొమ్మ రంగారావు, లంక వెంకటేశ్వరరావు, సీహెచ్ అశోక్ గౌడ్, పామర్తి ఏసు రాజు మాట్లాడారు. జిల్లాల పునర్వ్యవస్థీకరణ చేయనున్న నేపథ్యంలో లచ్చన్న జన్మస్థలమైన జిల్లా శ్రీకాకుళం జిల్లాకు గౌతు లచ్చన్న పేరు పెట్టడంతో రాష్ట్రంలోని రెండున్నర కోట్ల మంది బీసీలను గౌరవించినట్లు అవుతుందని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉక్కుసూరి గోపాలకృష్ణ, యేసు రాజు, మార్గాన్ని శ్రీనివాస్, లక్కోజు రాజగోపాలాచారి, ఎం రాంబాబు, గొర్ల రామారావు, ఏఎన్వీ శ్రీనివాస్, వీరంకి త్రినాథ్, ఎంవీ సుబ్బారావు, వివిధ బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అనుమతులు తప్పనిసరి

పెదవేగి : వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించే మండపాలకు పోలీస్, అగ్నిమాపక, విద్యుత్ శాఖలతో పాటు గ్రామ పంచాయతీల నుంచి అనుమతులు తీసుకోవాలని పెదవేగి ఎస్సై కె రామకృష్ణ సూచించారు. శనివారం ఆయన మాట్లాడుతూ పండుగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని విజ్ఞప్తి చేశారు. వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా గట్టి భద్రతా ఏర్పాట్లు చేశామన్నారు. చవితి మండపాల నిర్వాహకులు ఎక్కడా బలవంతపు వసూళ్లకు పాల్పడకూడదని, ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా విగ్రహాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. నిమజ్జన సమాచారం పోలీసులకు తెలియజేయాలన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

దెందులూరు: ప్రాధాన్యత క్రమంలో గ్రామ సమస్యల పరిష్కారానికి సమష్టిగా కృషి చేస్తామని మేధినరావుపాలెం గ్రామ సర్పంచ్, వైఎస్సార్ సీపీ సీనియర్ నేత ఎం.దుర్గాకుమారిరాజు అన్నారు. మేధినరావుపాలెం సచివాలయంలో గ్రామసభ జరిగింది. సమావేశంలో గ్రామంలోని ప్రధాన సమస్యలు చర్చించారు. అందరి సహాయ సహకారాలతో పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందని వివరించారు.

పరిశుభ్రతపై అవగాహన

పెదపాడు: ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వట్లూరు సీఆర్ఆర్ మహిళా కళాశాల యంబీఏ విభాగం విద్యార్థులు వట్లూరు గ్రామంలో అవగాహన కల్పించారు. ఎంబీఏ కో ఆర్డినేటర్ ఏ జ్యోతి ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. వర్షాకాలం నేపథ్యంలో పరిశుభ్రతను పాటించాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థులు ప్లకార్డుల ధరించి నినాదాలు చేసారు. ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య సూచనలు చేశారు. ఎంబీఏ విద్యార్థులు పాల్గొన్నారు.

శునకాలతో భయం భయం

- ప్రజలను వెంటబడి కరుస్తున్న వైనం
- కుక్కునూరు పీహెచ్‌సీ పరిధిలో 14 కేసులు



కుక్కునూరులోని ఓ వీధిలో సంచరిస్తున్న శునకాల గుంపు

కుక్కునూరు: శునకాలు గ్రామీణ ప్రజలు బెంబేలెత్తిస్తున్నాయి. కొన్ని వీధుల్లో కుక్కలు ప్రజల వెంటబడి కరుస్తున్నాయి. జూలై 1 నుంచి ఇప్పటి వరకు 14కు పైగా కుక్కకాటు కేసులు నమోదయ్యాయి. బాధితులు కుక్కునూరు పీహెచ్‌సీ పరిధిలో చికిత్స చేయించుకున్నారు. వీరికి ప్రైవేట్ ఆసుపత్రులను, ఆర్‌ఎంపీలను ఆశ్రయించిన వారి సంఖ్య అదనం.

రోడ్లపైనే తిష్ట

తెల్లవారిందంటే చాలు ప్రధాన రోడ్లపై కుక్కలు మందలు, మందలుగా తిరుగుతూ ప్రయాణికులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ద్విచక్ర వాహనంపై వెళుతున్న వారిని వెంబడిస్తుండడంతో వారు ప్రమాదాలకు గురవుతున్నారు. పాఠశాలకు వెళ్లే విద్యార్థులు, విధులు నిమిత్తం వెళ్లే ఉద్యోగులు, వివిధ ప్రాంతాలకు వెళ్లి వచ్చే ప్రజలు, వృద్ధులు కుక్కల భయంతో రోడ్లపై రాకపోకలు సాగించేందుకు వణికిపోతున్నారు.

పశువులనూ వదలడంలేదు

శునకాలు ప్రజలనే కాకుండా దూడలు, మేకలు, గొర్రెలను కూడా కరుస్తున్నాయి. కుక్కల దాడిలో దూడలు, గొర్రెలు మరణించిన ఘటనలు కుక్కునూరు మండల కేంద్రంలో చోటు చేసుకున్నాయి. వీటిని నిలువరించాల్సిన శాఖాధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెలువెత్తుతున్నాయి. కుక్కలకు ఫ్యామిలీ ప్లానింగ్ ఆపరేషన్ చేయించే పరిస్థితి కూడా లేదని, గ్రామాల్లో పరిస్థితి మరీ దయనీయంగా తయారైందని పలువురు వాపోతున్నారు. అధికారులు కుక్కలను నియంత్రణకు చర్యలు తీసుకోవాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు.

నియంత్రణ చర్యలేవీ?



వీధుల్లో కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతున్నాయి. ముఖ్యంగా చికెన్ షాపుల వద్ద కుక్కల బెడద ఎక్కువగా ఉంది. వీటిని చూస్తేనే భయమేస్తోంది. కుక్కల నియంత్రణకు అధికారులు చర్యలు చేపట్టాలి.

– మాదిరాజు ఖాదర్‌బాబు, కుక్కునూరు

వ్యాక్సిన్ ఇస్తున్నాం



జూలై 1 నుంచి ఆగస్టు 9వ తేదీ వరకు కక్కునూరు పీహెచ్‌సీ పరిధిలో మొత్తం 14 కుక్కకాటు కేసులు నమోదయ్యాయి. బాధితులు రేబీస్ వ్యాధి బారిన పడకుండా పీహెచ్‌సీకి వస్తే వ్యాక్సిన్ ఇస్తున్నాం.

– డాక్టర్ సుప్రియ, మెడికల్ ఆఫీసర్, కుక్కునూరు

అప్పులతోనే కాలం గడుపుతున్న కూటమి సర్కార్

చింతలపూడి : రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కేవలం కేంద్రం నుంచి అప్పులు తీసుకురావడంతోనే కాలం గడుపుతోందని సీపీఐ మండల కార్యదర్శి టి.బాబు విమర్శించారు. శనివారం పార్టీ రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను విడుదల చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా, సూపర్ సిక్స్‌లోనూ కొన్నిటిని మాత్రమే అమలు చేస్తూ ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ, పోలవరం, అమరావతి అంశాలపై మహాసభల్లో చర్చించి నిర్ణయం తీసుకుంటారని తెలిపారు.

ఏలూరును డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం



మత్తు పదార్థాలతో కలిగే నష్టాలను వివరిస్తున్న ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు

ఏలూరు (ఆర్ఆర్‌పేట) / : ఏలూరు జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దడానికి యువత సహకరించాలని ఏలూరు 3 టౌన్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు, ఏలూరు జిల్లా శక్తి టీం సభ్యులు కోరారు. ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్, డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్ ఆదేశాల మేరకు శనివారం స్థానిక సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల గ్రౌండ్, సీఆర్ఆర్ కాలేజీ హాస్టల్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. మత్తు పదార్థాలు శారీరక, మానసిక ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయని హెచ్చరించారు. నాడీ వ్యవస్థ దెబ్బతిని చదువులో వెనుకబడి వారి బంగారు భవిష్యత్తు నాశనం అవుతుందని, తల్లిదండ్రుల ఆశలు అడియాశలు అవుతాయని వివరించారు. ఒక విద్యార్థి డ్రగ్స్‌కు అలవాటు పడితే ముందుగా అతని స్నేహితులు లేదా రూమ్మేట్స్ వెంటనే కాలేజీ యాజమాన్యానికి లేదా పోలీసులకు గాని తెలియజే ఆ విద్యార్థికి కౌన్సిలింగ్ నిర్వహిస్తామని తెలిపారు. మత్తు పదార్థాలకు బానిస అయిన వారిని డీ అడిక్షన్ సెంటర్‌కు తరలించి, ఆ అలవాటును మాన్పించడానికి కృషి చేస్తామని చెప్పారు. మత్తు పదార్థాల వ్యాపారం లేదా వినియోగం చేస్తున్నట్టు గమనిస్తే వెంటనే 1972కు లేదా పోలీసులకు, డయల్ 112 ద్వారా సమాచారం అందించాలని, సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

ఐక్యంగా ఉండాలి

ఏలూరు (టూటౌన్): బహుజనులంతా ఐక్యంగా ఉండి రాజ్యాధికారం సాధించాలని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గెడ్డం సంపత్ రావు పిలుపునిచ్చారు. ఏలూరులో శనివారం సాయంత్రం జరిగిన బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) ముఖ్య నాయకుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. రాబోయే రోజుల్లో అంబేడ్కర్ ఆలోచనా విధానంతో, కాన్షీరామ్ పని విధానంతో పార్టీ బలోపేతానికి కృషి చేయనున్నట్టు చెప్పారు. జిల్లా అధ్యక్షుడు సిర్రా భరత్, నేతలు పాల్గొన్నారు.

గిరిప్రదక్షిణలో భక్తుల కిటకిట



పారిజాతగిరి శ్రీవెంకటేశ్వరస్వామి

జంగారెడ్డిగూడెం: స్థానిక గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి ప్రీతికరమైన రోజు శనివారం కావడంతో వేకువ జామున నుంచి ఆలయం ప్రత్యేక పూజలు చేశారు. వేకువ జామున నుంచి పారిజాతగిరి ఆలయ గిరిప్రదక్షిణలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, స్వామివారి దర్శించుకున్నారు. ఖమ్మం జిల్లా, కల్లూరుగూడెంకు చెందిన పులగం కేశవరెడ్డి 80 కేజీల బెల్లం కుందులతో తులాభారం వేసి స్వామివారికి సమర్పించారు. ముళ్లపూడి వెంకటేశ్వరావు, జితేంద్ర (పాలచర్ల), జంగారెడ్డిగూడెంకు చెందిన మాదాల రామ్మోహన్‌రావు, దమయంతి కుటుంబ సభ్యులు దాతృత్వంలో అన్నప్రసాదం, పులిహోర ప్రసాదం పంపిణీ చేశామని ఆలయ ఈఓ కలగర శ్రీనివాస్ తెలిపారు. దాతలను ఆలయ అర్చకులు వేద ఆశీస్సులతో సన్మానించారని చెప్పారు. ఆలయానికి విరాళాల ద్వారా రూ.38,868, పూజా టిక్కెట్ల ద్వారా రూ.18,930, ప్రసాదాల ద్వారా రూ.45,425 ఆదాయం వచ్చిందని ఆలయ కార్య నిర్వహణ అధికారి తెలిపారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పేరిచర్ల జగపతిరాజు, రెడ్డి రంగప్రసాద్, దండు ధనరాజు, గొట్టుముక్కల భాస్కర్‌రాజు, వాసవి సాయి నగేష్, ఫణి, దార రవి, మాదాల రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

జంగారెడ్డిగూడెం: స్థానిక సీఎస్‌టీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఎస్ ప్రసాద్ బాబు అధ్యక్షతన కళాశాల సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు మ్యూజికల్ చైర్స్, టగ్ ఆఫ్ వార్, ఉట్టు కొట్టే పోటీలు నిర్వహించారు. మ్యూజికల్ చైర్స్ ఆటలో డి.వెంకటలక్ష్మి, టి.దివ్య, ఉట్టు కొట్టే కార్యక్రమంలో కె.వరకుమార్, వై.వైష్ణవి, తాడు లాగే పోటీల్లో బి.పవన్ జట్టు, పి.ప్రసన్న విజేతలుగా నిలిచి ప్రిన్సిపాల్ ఎస్ ప్రసాద్ బాబు, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారు.

ఉట్టి కొట్టి.. బహుమతులు పట్టి

కొయ్యలగూడెం: కృష్ణాష్టమి వేడుకలు శనివారం ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. టెంపుల్స్ సెంటర్లోని శ్రీ రుక్మిణి సత్యభామ సమేత మదన గోపాల స్వామి ఆలయంలో తెల్లవారుజాము నుంచి విశేష పూజలు అర్చనాది అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం ఉట్టి కొట్టే కార్యక్రమాలు యువతకు బాలలకు విడివిడిగా నిర్వహించి విజేతలకు నగదు బహుమతులను అందజేశారు. అశోక్‌నగర్‌లో బాలలు ఉత్సాహంగా ఉట్టి కొట్టే కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు రాధాకృష్ణుల అలంకరణతో ఆకట్టుకున్నారు.



కొయ్యలగూడెం : రాధాకృష్ణుల వేషధారణలతో చిన్నారులు

వేషధారణల పోటీల్లో విజేతలకు పాలకమండలి, యాదవ సంఘం బహుమతి ప్రదానం చేశారు. కన్నాపురంలోని గొల్లగూడెం, దిప్పకాయలపాడులోని గొల్లగూడెం, తిమ్మన కుంట, శ్రీరంగపటన్నం, పరింపూడి పంచాయతీల్లో యాదవ సంఘాల ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. రామాలయాల కృష్ణాలయాల వద్ద ఉట్టి కొట్టే కార్యక్రమాల్లో మహిళలు సైతం పాల్గొన్నారు.

అలరించిన రాధాకృష్ణులు

బుట్టాయగూడెం: ఏజెన్సీప్రాంతంలోని పలు గ్రామాల్లో కృష్ణాష్టమి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. బుట్టాయగూడెం శివారు కొత్తపేటలో ఉన్న రాధాకృష్ణుని ఆలయంలో ఉదయం పూజా కార్యక్రమాలతోపాటు అన్న సమారాధన ఏర్పాటుచేశారు. రాత్రి చిన్నారులను శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో అలంకరించారు. ఈ పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. గ్రామంలోని పలు వీధుల్లో ఉట్టికొట్టి సందడి చేశారు. దొరమామిడిలో ఉన్న రాధాకృష్ణుల ఆలయం వద్ద కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. భక్తులు పాల్గొని పూజలు చేశారు.



కొయ్యలగూడెం : అశోక్‌నగర్‌లో ఉట్టి కొడుతున్న బాలలు



బుట్టాయగూడెం : బహుమతుల ప్రదానం



జంగారెడ్డిగూడెం : డిగ్రీ కళాశాలలో ఉట్టికొడుతున్న యువకుడు

ప్రకృతి వరప్రసాద పండుగ తీజ్



తీజ్ బుట్టలను తలపై ధరించిన ఆడపిల్లలు

టి.నరసాపురం : బంజారా భజరంగీ భేరి సంఘం ఆధ్వర్యంలో కృష్ణాపురం గ్రామంలో బంజారాల తీజ్ పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు భూక్యా నాగరాజు నాయక్ మాట్లాడుతూ గోరు బంజారా ఆడబిడ్డలకు ప్రకృతి ప్రసాదించిన వరాల పండుగ తీజ్ అని, ప్రపంచవ్యాప్తంగా ఉన్న బంజారాలు ఈ తీజ్ పండుగను తొమ్మిది రోజులపాటు ఘనంగా నిర్వహిస్తారని తెలిపారు. జిల్లా నాయకులు భూక్యా శ్రీనివాస్ నాయక్, సంఘ ప్రధాన కార్యదర్శి భూక్యా వేణుగోపాల్ నాయక్ మాట్లాడుతూ జీవితంలో వచ్చే కష్టాలను ఓర్చుకుంటూ, సహనంతో జీవించేలా బతుకు పాఠంను తీజ్ పండుగ నేర్పుతుందని అన్నారు. తీజ్ బుట్టలను ఆడపిల్లలు ఎత్తుకొని తీన్మార్ డబ్బులతో, సాంస్కృతిక బంజారా నృత్యాలతో ఊరంతా ఊరేగించుకుంటూ రాళ్ల చెరువులో నిమజ్జనం చేశారు. తీజ్ దీక్ష చేసిన 20 మంది ఆడబిడ్డలకు బంజారా భజరంగీ బేరి కమిటీ నాయకులు నూతన వస్త్రాలను బహూకరించారు. కార్యక్రమంలో మూడు శ్రీనివాస్ నాయక్, ధరావత్ బంగారయ్య, భూక్యా భిగనాదం, భూక్యా సురేష్, జరభల కృష్ణలీల, భూక్యా ధనలక్ష్మి, భవాని, లావుడియా సంధ్య తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ పౌరులుగా ఎదగాలి



మాట్లాడుతున్న న్యాయవాది పావని

ఏలూరు (టూటౌన్): నేటి బాలలు ఉత్తమ పౌరులుగా తమకు తాము తీర్చిదిద్దుకుని సమాజాభివృద్ధికి తోడ్పడాలని న్యాయవాది పావని సూచించారు. స్థానిక ప్రభుత్వ బాలుర సంక్షేమ వసతి గృహాన్ని ఆమె శనివారం సందర్శించారు. బాలల హక్కులు, చట్టాలపై ఆమె అవగాహన కల్పించారు. గర్భస్థ శిశువు నుండే పౌష్టికాహారం అందించి ఆరోగ్యవంతమైన బిడ్డగా జన్మించే హక్కు, విద్యా హక్కు, జీవించే హక్కు, వాక్ స్వాతంత్ర హక్కు మొదలైన హక్కులను పౌరులకు రాజ్యాంగం కల్పించిందని తెలిపారు. అనంతరం బాలలకు క్విజ్ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ శ్రీవల్లి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో నియంతల పాలన



సమావేశంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు

కొయ్యలగూడెం: రాష్ట్రంలో నియంతల పాలన నడుస్తోందని, ఇది ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టుగా మారిందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తుమ్మలపల్లి గంగరాజు పేర్కొన్నారు. శనివారం పార్టీ కార్యాలయం వద్ద జెడ్పీటీసీ దాసరి శ్రీలక్ష్మి, పార్టీ నాయకులతో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఒంటిమిట్ట, పులివెందుల జెడ్పీటీసీ ఎన్నికల తీరును అపహాస్యం చేస్తూ పోలీసు వ్యవస్థ పని చేసిందన్నారు. కూటమి బలపరిచిన అభ్యర్థులు విజయం సాధించారని తెలిపారు. కూటమి రాజకీయ నాయకుల అండదండలతో ఎన్నికల్లో నకిలీ ఓట్లు వేశారన్నారు. ఉత్తపుత్రుడు, దత్తపుత్రుడు రాష్ట్రాన్ని దోచుకు తింటున్నారని, స్వయంగా కూటమి అగ్రనాయకులే వందల కోట్ల రూపాయల అవినీతి గురించి మాట్లాడుతున్నా అధిష్టానం నోరు మెదపకపోవడం విడ్డూరంగా ఉందని వివరించారు. జెడ్పీటీసీ ఎన్నికలు అప్రజాస్వామికంగా జరిగాయనేది జగమెరిగిన సత్యమని, ఎన్నికల కమిషన్ అచేతనంగా ఉండి కేంద్ర ప్రభుత్వం కను సన్నల్లో కీలుబొమ్మగా మారిందని జెడ్పీటీసీ దాసరి శ్రీలక్ష్మి ఆరోపించారు. గత ఇరవై సంవత్సరాల కాలంలో చంద్రబాబు నాయుడు అరవై సార్లుకు పైగా సింగపూరు పర్యటనల్లోని ఆంతర్యం ఏమిటి అనేది ప్రజలు గ్రహించారని తెలిపారు. తండ్రి కొడుకులు రాష్ట్రంలో దోచుకున్న సొమ్మును సింగపూర్‌లో పెట్టుబడుల రూపంలో పెడుతున్నారని ఆరోపించారు. సహకార సంఘాల ఎన్నికలతో సహా రాబోయే స్థానిక ఎన్నికలకు వెళ్లే దమ్ము, ధైర్యం సీఎం, డిప్యూటీ సీఎంలకు లేదని ఎద్దేవా చేశారు. జిల్లా అధికార ప్రతినిధి దాసరి విష్ణు, ఎంపీపీ గంజిమాల రామారావు, ఎంపీటీసీలు ఘంటా శ్రీను, ఘంటసాల సీనమ్మ, ఎస్‌కే బాజీ, పార్టీ నాయకులు చిక్కాల దుర్గాప్రసాద్, నూకల రాము, పాముల నాగమునిస్వామి, కంభంపాటి బుజ్జిబాబు, నిక్కర్ నాగేశ్వరరావు, దూలపల్లి కాంతారావు, గంటా రమేష్, ఏలేటి భాస్కర్, ఘంటసాల మధు పాల్గొన్నారు.

సొసైటీ చైర్మన్ ప్రమాణ స్వీకారం

కామవరపుకోట: కామవరపుకోట సొసైటీ నూతన చైర్మన్‌గా ఘంటా మాధవరావు శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్, ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

20న ఎలక్ట్రికల్ వర్కర్ల రాష్ట్ర సమావేశం

ఏలూరు (టూటౌన్): ఈ నెల 20న ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సమావేశం శ్రీకాకుళంలో నిర్వహించనున్నట్టు యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు లింగమల్లు శ్రీనివాసరావు శనివారం తెలిపారు. ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్లకు ప్రభుత్వం న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

గణనాథుల ముస్తాబు



చింతలపూడిలో వినాయక విగ్రహాలు



విగ్రహాలను లారీలోకి ఎగుమతి చేస్తున్న వ్యాపారులు

చవితి ఉత్సవాలకు ముమ్మర ఏర్పాట్లు

చింతలపూడి : గణేష్ నవరాత్రి ఉత్సవాలకు వినాయక విగ్రహాలు ముస్తాబవుతున్నాయి. వినాయక విగ్రహాలను హైదరాబాద్, సూర్యాపేట, విజయవాడ పట్టణాల నుంచి వ్యాపారులు దిగుమతి చేసుకుంటున్నారు. స్థానికంగా వివిధ ఆక్వతుల్లో ఉన్న గణేష్ విగ్రహాలను సిద్ధం చేశారు. విగ్రహం సైజుని బట్టి రూ.3 వేలు నుంచి రూ.25 వేలు వరకు విక్రయిస్తున్నారు. చింతలపూడి నియోజకవర్గంలో గ్రామ, గ్రామాన గణపతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఆయా కమిటీలు ఏర్పాట్లను ప్రారంభించాయి. ఇదిలా ఉండగా ఏటా వినాయక విగ్రహాలను స్థానిక పెద్ద చెరువు, నాగిరెడ్డిగూడెం సమీపంలో ఉన్న తమ్మిలేరు ప్రాజెక్టులో నిమజ్జనం చేస్తున్నారు. ఎప్పటి కప్పుడు ప్రాజెక్టు అధికారులు వినాయక విగ్రహాలను తొలగించకపోతే ప్రాజెక్టు నీరు కలుషితమయ్యే ప్రమాదం ఉందని పర్యావరణ వేత్తలు హెచ్చరిస్తున్నారు.

మట్టి విగ్రహాలే మేలు



గణేష్ నవరాత్రి ఉత్సవాలకు పెట్టుకుని మట్టి విగ్రహాలను భక్తులు వినియోగించాలి. దీని వల్ల విగ్రహాలను నిమజ్జనం చేసినప్పుడు నీరు కలుషితం కాదు. పర్యావరణ సమస్య తలెత్తదు. స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి మట్టి విగ్రహాలను భక్తులకు సరఫరా చేయాలి.

– ఎస్‌కే ఆజాద్ బాబు, అజీమ్ చారిటీ ఫౌండేషన్ చైర్మన్

జాగ్రత్తలు తీసుకుంటాం



వినాయక చవితి ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటాం. ఉత్సవ కమిటీల నిర్వాహకులు కూడా పోలీస్ వారి నిబంధనలు పాటించాలి. ముఖ్యంగా నిమజ్జనం సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకుని విగ్రహాలను నిమజ్జనం చేయాలి.

– కె.సతీష్ కుమార్, ఎస్సై చింతలపూడి